తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కుప్పంలో ట్రిపుల్ ఐటి ఏర్పాటుచేయాలి

### - శాసనమండలిలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, మార్చి 12 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వం తరపున ట్రిపుల్ ఐటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం శాసన మండలిలో జరిగిన చర్చలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల ప్రసంగించారు. ఇప్పటికే రాష్ట్రంలోని కడప, శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలులో ట్రిపుల్ ఐటిలు ఉన్నాయన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా చిత్తూరు జిల్లా కుప్పం ద్రవిడ వర్సిటీలో ట్రిపుల్ ఐటిని ఏర్పాటుచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ద్రవిడ వర్సిటీలో సుమారు 600ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ ట్రిపుల్ ఐటి ఏర్పాటుచేస్తే రెండు జిల్లాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం



పాత బస్సుషెల్టర్‌లోకి దూసుకెళ్లిన లారీ

కోట, మార్చి 12 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు పంచాయతీలోని మైక్రోటవర్ కాలనీ వద్ద బుధవారం ఓ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పాత బస్సుషెల్టర్‌ను ఢీకొంది. గూడూరు నుంచి కోట వైపు వస్తున్న ఈ లారీ ఆర్అండ్‌బి రహదారి పక్కనే ఉన్న బస్సు షెల్టర్‌లోకి దూసుకెళ్లింది. ఆ ప్రాంతంలో అప్పటికి స్కూలు పిల్లలు బస్సెక్కి వెళ్లిపోయి ఉండటంతో ఘోర ప్రమాదం తప్పిందని ఆ కాలనీవాసులు తెలిపారు. ఒక్కసారిగా లారీ బస్సు షెల్టర్ మీదకు దూసుకు రావడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. అయితే మధ్యాహ్నం నుంచి లారీని సంబంధిత యజమాని అక్కడి నుంచి తొలగించారు.

# కొండపై మఠాలపై కొరఢా!

### -తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దు !
### -మతం పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
### -హైకోర్టు నోటీసుల్లో సీరియస్



తిరుమల, మార్చి 12ప్రభాతవార్తప్రతినిధి:

పుణ్యక్షేత్రం తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తే చూస్తూ ఊరుకోబోమని, నిబంధనలు పాటించని మఠాలపై చర్యలు తీసుకుంటామని హైకోర్టు ధర్మాసనం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన మఠాలపై చర్యలు తీసుకోవాలని ఏకంగా దేవాదాయశాఖ కార్యదర్శి, విజిలెన్స్‌కు, టిటిడి ఇఒకు నోటీసులు జారీచేయడం బుధవారం సంచలనంగా మారింది. తిరుమలకొండపై మతం ముసుగులో కొందరు స్వాములు ,మఠాధిపతులు తమతమ మఠాలపేరుతో భవనాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలు ఇదివరకే జనసేనపార్టీ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ మండిపడ్డారు. ఆమ్‌ద్మీపార్టీ, హిందూసమాజం సంఘం ప్రతినిధులు కూడా తిరుమలలో పలు మఠాలపై, మఠాల నిర్మాణాలపై నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో హూకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తాజాగా బుధవారం సంచలన తీర్పువెలువడించింది. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం తిరుమలపై టిటిడి ,టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా పలు మఠాలు భవనాల నిర్మాణాలు చేపట్టాయని, వీటి విషయంలో చర్యలు తీసుకోవాలంటూ టిటిడి అధికారులను ఆదేశించింది. తిరుమలలో నిర్మాణాలపై అత్యంత జాగ్రత్తలు వహించాలని, ఎంతో సుందరమైన తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తారని హైకోర్టు హెచ్చరించింది. ఇలాగే నిర్మాణాలు కొనసాగిస్తే అటవీప్రాంతం కనుమరుగైపోతుందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పుణ్యక్షేత్రం తిరుమల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని న్యాయస్థానం హెచ్చరించడం ఇప్పుడు టిటిడి అధికారుల్లో కలకలం రేపుతోంది. ధార్మికసంస్థలు మతం పేరుతో ఇలా నిర్మాణాలు చేస్తామంటే కుదరదని, ఇప్పటికే ఒక మఠం చేపట్టిన నిర్మాణాలపై చర్యలకు ఆదేశించింది. పూర్తి వివరాలుతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 7వతేదీకి వాయిదా వేసింది. కాగా తిరుమలలో ఆలయానికి సమీపంలో కొన్ని మఠాలు, గోగర్భమ్‌డ్యామ్ సమీపంలో కొన్ని మఠాలు నిర్మాణాలు జరిగాయి. ఇంకా మఠాలు అత్యంత ఎత్తయిన భవనాలను నిర్మిస్తున్నాయి. నిబంధనలు విరుద్దంగా ఈ నిర్మాణాలపై హైకోర్టులో పిల్ దాఖలుతో న్యాయస్థానం తీవ్రంగా హెచ్చరించింది. నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని తొలగించేందుకు టిటిడికి మార్గం సుగమమైంది. రాజకీయ నేతలు తమతమ పబ్బం గడుపుకునేందుకు స్వామీజీల సేవల్లో తరించడం, వారికి నిబంధనలు విరుద్దంగా అడ్డదిడ్డంగా అనుమతులివ్వడం ఇప్పుడు పెద్ద దుమారం రేపుతోంది.

# కాల్పుల కలకలం

### తుపాకీతో బెదిరించి దోచుకోవాలని వెళ్లి పట్టుబడ్డ నిందితులు
### కలవరపడ్డ చిత్తూరు ప్రజానీకం
### - బ్యాంకు దోపిడి జరుగుతుందని అప్రమత్తమైన పోలీసులు
### - పట్టుబడిన నలుగురు అగంతకులు









చిత్తూరు, మార్చి 12 ప్రభాతవార్త:

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బాగా డబ్బులు పోగొట్టుకున్న ఓ వ్యక్తి అదే వ్యాపారంలో బాగా ఆర్జించిన వ్యక్తిని తుపాకులతో బెదిరించి పెద్ద ఎత్తున డబ్బులు రాబట్టాని నిర్ణయించి వేసిన పథకం విఫలమైంది. తుపాకీలతో బెదిరించిన వ్యక్తుల నుండి బాధితుడు బయటికి వచ్చి అరవడంతో స్థానికులు వెళ్ళి తుపాకులతో వచ్చిన వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. జిల్లా కేంద్రం చిత్తూరు గాంధీరోడ్డులో బుధవారం తెల్లవారుజాము జరిగిన ఈ సంఘటన చిత్తూరు పరిసరాల్లో సంచలనం కలిగించింది. చిత్తూరు గాంధీరోడ్డులో ఐడిబిఐ బ్యాంకు సరిసరాల్లో పుష్ప షాపింగ్ కిడ్స్ వరల్డ్ యాజమాని చంద్రశేఖర్ కుటుంబంతో నివాసం వుంటున్నాడు. ఇతను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి బాగా ఆర్జించినట్లు తెలుస్తోంది. ఇతనిని తుపాకీలతో బెదిరించి అతని నుండి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేయాలని గిరింపేటలోని ఎస్ఎల్‌వి ఫర్నిచర్ యాజమాని సుబ్రమణ్యం పక్కా ప్లాన్ వేశాడు. ఈ మేరకు ఐదు మంది కిరాయి వ్యక్తులను మాట్లాడి వారి ద్వారా చంద్రశేఖర్‌ను తుపాకులతో బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేయానికి ప్రణాళిక రచించాడు. ఈ మేరకు బుధవారం తెల్లవారుజాము 6.15 గంటలకు ముహుర్తం నిర్ణయించుకుని కిరాయి వ్యక్తులను గాంధీ రోడ్డులోని చంద్రశేఖర్ ఇంటికి పంపాడు. అయితే కిరాయి హంతకులు తుపాకులతో చంద్రశేఖర్‌ను బెదిరిస్తుండటం స్థానికులు చూడటం, చంద్రశేఖర్ సైతం వారి నుండి తప్పించుకుని తనను రక్షించాలని అరవడంతో వారి పథకం రివర్స్ అయ్యింది. అప్పటికే అదే పరిసరాల్లో వున్న మొబైల్ పోలీసులకు సమాచారం అందడం, బాధితుడు చంద్రశేఖర్ నేరుగా టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో నిముషాల వ్యవధిలో గాంధీ రోడ్డు పోలీసులతో నిండిపోయింది. అప్పటికే స్థానికులు చంద్రశేఖర్‌ను రక్షించడానికి వెళ్ళడంతో అక్కడి నుండి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించిన అగంతకులను స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. ఒక అగంతకుడు గోడ దూకి పారిపోవడానికి ప్రయత్నించినప్పటికీ స్థానికులు, పోలీసులు ఆ అగంతకుడిని దోడదూకి పట్టుకున్నారు. మిగిలిని ముగ్గురు అగంతకులను స్థానికులు పట్టుకుని చితకబాదారు. వారి నుండి రెండు తుపాకులను స్వాధీనం చేసుకుని పోలీసులు వచ్చాక నలుగురు అగంతకులతో పాటు రెండు తుపాకీలను స్థానికులు పోలీసులకు స్వాధీనం చేశారు. చిత్తూరులో తెల్లవారుజాము తుపాకులతో బెదిరించి దోచుకెళ్ళడానికి ప్రయత్నించారని విస్తృతంగా ప్రచారం జరుగడంతో చిత్తూరు ప్రజలు ఒక్కసారిగా నివ్వెరపోయారు. చిత్తూరులో ఇప్పటి వరకు డబ్బుల కోసం తుపాకీలను వాడినట్లు చరిత్ర లేదు. మాజీ ఎమ్మెల్యే సికె బాబు హత్యాయత్నం సమయంలో మాత్రమే అగంతకులు తుపాకులు వాడారు. మళ్ళీ డబ్బుల గుంజడానికి తుపాకులను వాడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గాంధీరోడ్డులో ఐడిబిఐ బ్యాంకు దోపిడి కోసం అగంతకులు వచ్చారని ప్రచారం జరుగడంతో పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. ఒక సమయంలో మిద్దె పైన అగంతకులు తుపాకులతో వుండటంతో కింద మొత్తం పోలీసులు సైతం బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు ధరించి తుపాకులతో సిద్ధం అయ్యారు. ఎస్పీ మణికంఠ చందోలు సంఘటనా స్థలంను పరిశీలించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న నలుగురు అగంతకులను స్థానికులు, పోలీసులు కలిసి పట్టుకోగా మరో ఇద్దరు పరారీలో వున్నారు. వీరిని సైతం పోలీసులు పట్టుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. స్థానికంగా తుపాకులతో వెళ్ళిన అగంతకుల సిసి కెమెరా ఫుటేజ్‌లు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. చిత్తూరు దుర్గానగర్ కాలనీలో రెండు రోజుల క్రితం నలురుగు అగంతకులు అర్ధరాత్రి సమయంలో తుపాకులు ధరించి రెక్కీ నిర్వహించిన విషయం సిసి కెమెరా ఫుటేజ్‌ల్లో బహిర్గతం కావడం, ఇప్పుడు ఏకంగా తుపాకులతో ఒక వ్యక్తిని బెదిరించి అతని నుండి పెద్ద ఎత్తున డబ్బు దండుకోవాలని పక్కా స్కేచ్‌తో సిద్ధం కావడంతో చిత్తూరు ప్రజానీకం ఎప్పుడు ఏం జరుగుతుందనే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే చిత్తూరులో బుధవారం జరిగిన ఘటనలో మాత్రం పోలీసులు సకాలంలో స్పందించి పక్కాగా వ్యూహం పన్ని అగంతకులను పట్టుకోవడంతో ప్రజలు అభినందిస్తున్నారు. చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## కొత్తగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణం అవసరం

### తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటుచేయండి
### తిరుపతి సమస్యలపై ఎంఎల్ఎ ఆరణి అసెంబ్లీలో చర్చ



తిరుపతి, మార్చి 12ప్రభాతవార్త:

ఆద్యాత్మిక నగరం, స్మార్ట్‌సిటీగా తిరపతి అభివృద్ధిచెందిందని, ఇక్కడ కొన్నేళ్ళ క్రిందట భూగర్భడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటైందని, అయితే అదీ ఇప్పటి అవసరాలకు ఉపయోగంలేదని, నూతనంగా అధునాతన భూగర్బడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు కోరారు. ఇందుకు ప్రభుత్వం నుండి తగిన సహకారం కావాలని అసెంబ్లీ వేదికగా బుధవారం తొలిసారిగా గొంతు విప్పారు. తిరుపతి విద్యాకేంద్రంగా మారిందని, ఇక్కడ పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. ప్రభుత్వంకు సంబంధించి కళాశాలలు లేవని, టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్నవి మాత్రమే ఉన్నాయన్నారు. శెట్టిపల్లి భూములకు సంబంధించి 30ఏళ్ళుగా సమస్య ఉందన్నారు. తుడ పరధిలో శెట్టిపల్లిని చేర్చాలని,. ఇందుకు మంత్రి నారాయణ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

## తెప్పపై మలయప్ప అభయం

### -గోవిందా,....గోవింద అంటూ భక్తులు తన్మయత్వం

తిరుమల, మార్చి 12ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలలో వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ నాల్గవరోజు బుధవారం రాత్రి మలయప్ప స్వామిగా అభయమిచ్చారు.. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత ఆలయం నుండి శ్రీదేవిభూదేవి సమే తుడై మలయప్పస్వామి మాఢ వీధుల్లో ఊరేగుతూ తెప్పపై మూడుచుట్లు విహరించాడు. పెద్దజీయంగారు, చిన్నజీయం గారు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విజిలెన్స్ వింగ్ విఎసఓ ఎన్టీవిరామ్‌కుమార్, ఇఇలు సుబ్రమణ్యం, సుధాకర్, డిఇ చంద్రశేఖర్, ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్ కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తులు గోవిందనామస్మరణలు చేయగా దేవదేవుడు అధిరోహించిన తెప్ప పుష్కరిణిలో పవిత్రమైన తీర్థంలో కదిలింది. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు. కాగా తెప్పోత్సవంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డిజి ఆర్‌కె మీనా దంపతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

### - యువత పోరు కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఫైర్



కలెక్టరేట్ ఎదుట వైకాపా ఆధ్వర్యంలో యువత పోరు నిరసన

చిత్తూరురూరల్, మార్చి12 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫైర్ అయ్యారు. జిల్లా కేంద్రం చిత్తూరులో వైకాపా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. చిత్తూరు ఆమూల్ డైరీ ఆవరణ నుండి వైకాపా నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ వరకు ఊరేగింపుగా వెళ్ళి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంను ఉద్దేశించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు కష్టాలు అధికం అయ్యాయన్నారు. ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇస్తున్న మొత్తం కంటే ఎక్కువ మొత్తం ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తయినా ఒక్క విద్యార్థికి ఇప్పటి వరకు విద్యాదీవెన, వసతి దీవెన కింద మొత్తాలు ఇవ్వకపోవడం దౌర్భాగ్యమన్నారు. కలెక్టరేట్ ఎదుట నిరసన అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంపి విజయానందరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర వైకాపా నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ భరత్, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, నియోజకవర్గ వైకాపా నాయకులు, మండల వైకాపా నాయకులు, వైకాపా జడ్పీటిసీలు, ఎంపిపిలు, కార్యకర్తలు, విద్యార్థులు హాజరయ్యారు.

# గిట్టుబాటు ధర లేక అన్నదాత దిగాలు

### -కళ్ళాల్లోనే ధాన్యం అమ్మకం





తెలుగుగంగ కాలువపైనే వరిపంట బస్తాలను సిద్దంగా ఉంచిన దృశ్యం
వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి

తొట్టంబేడు, మార్చి 12 ప్రభాతవార్త

అన్నదాతలు లేకపోతే జీవించే ప్రతి ఒక్కరికీ అన్నం లేదు. ఇది అందరికీ తెలిసిందే అయితే నేడు అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. తూర్పు మండలాల్లో ప్రధానంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో అన్నదాతలు ధాన్యం పరిస్థితి దయనీంగా మారింది. నేటి పరిస్థితుల్లో పెట్టుబడులు ఎక్కువ, రాబడి తక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా ఏడాది ఎన్నడూ లేనంతగా జనవరిలో కూడా వర్షాలు పడడంతో అన్నదాతలు వేసిన వరిపంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయింది. దీనికి కారణం తేమశాతం ఎక్కువగా ఉండడమే. దీంతో అన్నదాతలు తాము పండించిన వరిధాన్యాన్ని కళ్ళాల్లో నుంచే దళారులకు అమ్మివేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు, రైతులు, పిఎసిఎస్‌ల నుంచి సేకరించే ధాన్యాన్ని సేకరించాల్సి అవసరం ఉంది. ఎవరికి వారు కార్యాలయాల్లో తిట్టవేసి కేవలం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువువైంది. వ్యవసాయశాఖ సిబ్బంది తప్ప మరెవ్వరు క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదనేది నిజమైన విషయం. తొట్టంబేడు మండలంలో రబీ సీజన్‌లో మొత్తం 4280 హెక్టార్లలో వరిపంట వేశారు. వీటిలో ఆర్ఎన్ఆర్‌లు 75కిలోల బస్తా రూ.1750 ధర పలుకుతోంది. ఇక బుడ్డలు 1710లు 75కిలోల బస్తా ధర పలుకుతోంది. ఆర్ఎన్ఆర్‌లు మండలంలో సుమారు 2వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఇక 1500 కెఎన్‌డబ్యు630 మరియు 733లు రకాలు కేవలం తక్కువ ధరకే పలుకుతోంది. ఈఏడాది అకాల వర్షాలు, మరోవైపు మంచుతో వరిపంట తెగుళ్ళ వారిన పడి నష్టపోయారు. ప్రస్తుతం జనవరిలో కూడా రెండు పదుల వర్షం పడడంతో అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఇక వరి పంటనే కాకుండా, అక్కడక్కడా వేరుశనగ, ఇతర ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ఇక అన్నదాతలు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 11 అంకెల విశిష్ట సంఖ్యను ప్రతి ఒక్కరుతీసుకోవాలని లేదంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తిస్తాయని ఈసంఖ్యను అన్నదాతలు ఖచ్చితంగా తీసుకోవాలని కోరారు.పక్కనే తెలుగుగంగ కాలువ ఉన్నా నీటిని విడుదల చేయకపోవడంతో ఉన్న నీటితోనే పంటను సాగుచేసి ఎలాగోలా దక్కించుకున్నారు. ప్రస్తుతం తెలుగుగంగ కాలువలో తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల ప్రజల దాహార్తిని తీర్చడం కోసం నీళ్లున్నా ఇవి పంట చేతికివచ్చేదశలో ఉపయోగపడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి:-**

వేరుశనగ , వరి రైతులను ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు. పంటదిగుబడి వచ్చే విత్తనాలైన అందించినా నీళ్ల లేకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. దీంతో వేరుశక్కాయల్లో నాణ్యత లేకపోవడంతో పంటసాగుకు వెచ్చించినపెట్టుబడులు అయినా చేతికందుతుందా?లేదా?అని దిగులుపడుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించి వేరుశనగ అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఎస్సీ, ఎస్టీ, బిసీ ఇళ్ళ లబ్దిదారులకు

## అదనపు ఆర్థిక సహాయం

### కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరురూరల్, మార్చి 12 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసీ లబ్దిదారుల ఇళ్ళ నిర్మాణాలకు చేయూతనిస్తూ అదనపు సహాయంగా రూ.50 వేలు నుండి రూ.1 లక్ష వరకు మంజూరు చేయనుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసీ వర్గాల లబ్దిదారులు త్వరితంగా ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందేలా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎస్సీ, బిసీ లబ్దిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్దిదారులకు రూ.75 వేలు నుండి రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బిసీలకు సంబంధించి 17,800 మంది లబ్దిదారులను గుర్తించడం జరిగిందని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడానికి 1.20 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో డికెటి పట్టాలు, వెబ్ ల్యాండ్ సక్రమంగా నిర్వహించకపోవడం కారణంగా రెవెన్యూ సమస్యలు అధికంగా ఉత్పన్నం అయ్యాయన్నారు. రెవెన్యూ అంశాలపై, రీ-సర్వే సమస్యల పరిష్కారానికి రెండు విధాల గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా భూ సమస్యలు, మ్యూటేషన్స్, సర్వేనెంబర్, రీ-సర్వే సమస్యలు, దాదాపు పది వేల వినతులు అందాయన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి 1,500 వినతులు ఇప్పటి వరకు పరిష్కరించడం జరిగిందన్నారు. వెబ్‌ల్యాండ్ సమస్యలను పరిష్కరించడానికి జాయింట్ కలెక్టర్, అర్డీఓలు స్వయంగా తహసిల్దారు కార్యాలయానికి వెళ్ళి పరిష్కరించేలా సూచనలు చేయడం జరిగిందన్నారు.

## విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించింది వైసిపి ప్రభుత్వమే

**రామకుప్పం, మార్చి 12 ప్రభాతవార్త** రాష్ట్రంలో విద్యావ్యవస్థను వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని సిఎం పిఎ మనోహర్ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో ఫీజు రీఎంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించిందన్నారు. అనంతరం వైకాపా ప్రభుత్వం ఆపథకాలకు పేర్లు మార్చి ఫీజు రీఎంబర్స్‌మెంట్లు విద్యార్థులకు అందించకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాత బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. 2024-25 విద్యా సం॥కు గాను ఫీజురీ ఎంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేశారన్నారు.

## ఉపాధిహామీలో 1.23లక్షల రికవరీకి ఆదేశం - డ్వామా పి.డి. రవికుమార్



**కుప్పం, మార్చి 12 ప్రభాతవార్త** కుప్పం మండలంలో చేపట్టిన మహాత్మాగాంధీ ఉపాధిహామీ పనులకు సంబంధించి 1,23,922లక్షల రూపాయల రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పి.డి. రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ పనులు అడిగిన కూలీలకు తప్పక పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు రికవరీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కాగా 1.4.23నుంచి 31.3.24వరకు మండలంలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, సర్వశిక్ష అభయాన్ పథకాల్లో భాగంగా రూ 13.42కోట్ల మేర పనులు చేపట్టారు. ఈ పనులను 29 పంచాయతీల్లో కూలీలు చేపట్టారు. వీటిలో రూ 1.23లక్షల రికవరీకి అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడి వెంకటరత్నం, ఎస్‌టిఎం లోకేష్‌రెడ్డి, ఎస్ఆర్‌పి మల్లికార్జున, ఎపిఓ జ్యోతి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## చియ్యవరం గ్రామంలో వైద్యశిబిరం



**తొట్టంబేడు, మార్చి 12 ప్రభాతవార్త** మండలంలోని కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్‌సి.శివకుమార్‌రెడ్డి, డాక్టర్ ఇ.మాధవుడుల ఆధ్వర్యంలో చియ్యవరం గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చియ్యవరం గ్రామానికి చెందిన ఎం.కనుపూరమ్మ (27), వి.ప్రసాద్(27) జ్వర లక్షణాలతో వచ్చి చికిత్స పొందారన్నారు. గత ఏడాది డిసెంబర్ 2024లో వచ్చిన ఫీవర్ ఎపిడమిక్‌ను దృష్టిలో ఉంచుకుని వైద్యాధికారులంతా అప్రమత్తమై ఈనెల 11వ తేదీ నుంచి క్షేత్రస్థాయి సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేపట్టినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సర్వేలో గుర్తించిన జ్వరపీడితులకు చియ్యవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని చికిత్స అందించారన్నారు. ఈనెల 12న కె.వేమాలయ్య, పి.రాము, కె.వెంకటరత్నమ్మలను ల్యాబ్ పరీక్షలు మరియు మెరుగైన వైద్యం కాసరం పిహెచ్‌సి కాసరంకు పంపామన్నారు. ఎ.కనుపూరమ్మ, వి.ప్రసాద్‌లను ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. చియ్యవరం గ్రామ సచివాలయంలో కార్యదర్శి కె.అంకయ్య మరియు సర్పంచ్ సుబ్రమణ్యం వారి ద్వారా గ్రామంలో పారిశుద్య చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామంలో చల్లించారు. ప్రజలుకు పరిసరాలు పరిశుభ్రత, కీటక జనిత వ్యాధులపై ఆరోగ్య విద్యను అందించి అవగాహన కల్పించారు. గ్రామంలో జ్వరపీడితులు సంఖ్య అదుపులో వచ్చేంతవరకు వైద్యశిబిరాలను కొనసాగిస్తామని వైద్యాధికారులు పనిచేశారు.

## మహిళా సాధికారతకు తెలుగుదేశంపార్టీ పెద్దపీట



**తొట్టంబేడు, మార్చి 12 ప్రభాతవార్త** మహిళా సాధికారతకు తెలుగుదేశంపార్టీ పెద్దపీట వేస్తోందని మహిళలకు సమానంగా ఆస్తి హక్కు కల్పించిన ఘనత టిడిపిదే డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి జీవన స్థితిగతులను మార్చి ఘనత ఒక్క టిడిదే అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటిని సమర్ధవంతంగా నడిపే మహిళలు రాజకీయాల్లోను మరింత రాణించి సత్తా చాటగలరని గుర్తించిన అన్న ఎన్టీఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారని గుర్తుచేశారు. దానికి కొనసాగింపుగా చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు. మహిళల పేరుమీద ఇంటిపట్టాలు, ఇంటి నిర్మాణం, భూమి కొనుగోలు వంటి పథకాలు ఎన్నో ఆచరణాత్మకంగా అమలు చేసి చూపించారన్నారు. దీనికి కొనసాగింపుగా కూటి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ 2025-26 బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4,332కోట్లు కేటాయించారన్నారు. మహిళలను జగన్‌రెడ్డి దగా చేశారని, నమ్మించి మాట తప్పి ఓటిఎస్ పేరుతో ఒక్కో మహిళ నుంచి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు బలవంతంగా వసూలు చేశారని, సెంటు పట్టా పేరుతో మహిళలను అప్పులపాలు చేశారన్నారు. అంగన్‌వాడీల జీతాలు చంద్రన్న రూ.6,400 పెంచగా జగన్ పెంచింది కేవలం రూ.వెయ్యి మాత్రమే అన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు రాష్ట్ర నాయకురాలు రేణుకాదేవి, సుమతి, మల్లీశ్వరి, అనిత, కుమారి, చంద్రమ్మ, అమరావతి, తులసి ద్రాక్షాయణి, గజలక్ష్మి, సుమతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో తెదేపా యువనాయకుడు



**తొట్టంబేడు, మార్చి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనార్థం తెలుగుదేశం యువ నాయకులు అజయ్‌సజ్జా కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ యువత అధ్యక్షులు సుజిత్ కుమార్‌రెడ్డి, కోబాక లక్ష్మణ్, చరణ్, చందులు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద వీరికి స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని ఏర్పాటు అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు.

## భారతీయ సంస్కృతిని ప్రొత్సహించడమే లక్ష్యం



**తిరుపతి విద్య, మార్చి 12 ప్రభాతవార్త** భారతీయ సంస్కృతి, కళను ప్రొత్స హించడమే లక్ష్యంగా ఐజీ ఎన్సీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానంద జోషి, డాక్టర్ ప్రియాంక మిశ్ర పేర్కొన్నారు.జాతీయ సంస్కృత వర్సిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ నేషనల సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్సీఏ) 10వ ప్రాంతీయ కేంద్రాన్ని తిరుచానూరులో బుధవారం వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వర్సిటీలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ వైష్ణవాగమాలు,శిల్పకళలు ప్రోత్స హిస్తూ, ఆధునిక తరానికి ఈ కళల పై ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాలకు కేంద్రంగా తిరుచానూరు ప్రారంభించడం జరిగిందన్నారు.వీసీ జీఎస్ఆర్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ మరుగుపడిన కళలను, సంగీతాన్ని,నృత్య విద్యలను ఆధునిక ప్రపంచానికి అందించడం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, సాహిత్యవిద్యను నేటితరానికి అందించాలనే లక్ష్యంతో వర్సిటీ పనిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యావేత్త మాళవికా జోషి,పద్మా సుబ్రమణ్యం,పాండిచ్చేరి రీజనల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాఘవన్,నోడల్ ఆఫీసర్ అనితా సూరి, డీన్ దక్షిణమూర్తి శర్మ, పీఆర్ ప్రొఫెసర్ రమేష్, డాక్టర్ కనపాల కుమార్, అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలను వివరిస్తున్న వైవి రాజేశ్వరి

గణనాధుని సన్నిధిలో మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి



**కాణిపాకం, మార్చి 12 ప్రభాతవార్త:** మాజీ రాజ్యసభసభ్యులు కాంభంపాటి రామ్మోహన్‌రావు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ ఉద్యోగి నిజాయితీ

-భక్తులు పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ తిరిగి అప్పగింత



**కాణిపాకం, మార్చి 12 ప్రభాతవార్త:** ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తురాలు పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను ఆలయ ఉద్యోగి గుర్తించి నిజాయితీతో భక్తురాలికి అప్పగించిన సంఘటన కాణిపాకం ఆలయంలో బుధవారం జరిగింది. వివరాలిలావున్నాయి. బంగారుపాళ్యం మండలం నల్లంగాడుకు గ్రామానికి చెందిన సీ.కీర్తన అనే భక్తురాలు తన కుటుంబసభ్యులతో కలసి బుధవారం కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చారు. ఈసందర్భంగా తన చేతిలోని 14 గ్రాముల బంగారు గాజును ఆలయంలో పోగొట్టుకుంది. ఈనేపథ్యంలో దేవస్థానంలో పనిచేసే ఉద్యోగి వీరమణికి ఈబ్రాస్‌లెట్ దొరకడంతో ఆలయ హోంగార్డు హెడ్ పీఎల్‌సీ వినాయకంతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అప్పగించారు.ఈమేరకు బ్రాస్‌లెట్ గాజు పోగొట్టుకున్న భక్తురాలు కీర్తనను గుర్తించి ఆమెకు ఏఈఓ రవీంద్రబాబు అందజేశారు. అలాగే దొరికిన బ్రాస్‌లెట్‌ను నిజాయతీగా ఆలయ అప్పగించిన వీరమణి, హోంగార్డు హెడ్ వినాయకంను ఏఈఓ రవీంద్రబాబు అభినందించారు.

## నారాయణ పాఠశాలలో లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం



**కుప్పంరూరల్, మార్చి 12 ప్రభాతవార్త** కుప్పం పైబాటలో ఉన్న నారాయణ పాఠశాలలో లెడ్ కాన్ ఫ్రరెన్స్ కార్యక్రమంను ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈసం దర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభాపా టవాలను వివిధ రకాల కృత్యాల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో డిజిఎం కొండలరావు, ఎజిఎం ఫణికుమార్, ఆర్ఐ ప్రసాద్, ఇ-కిడ్స్ కోఆర్డినేటర్ రేవతి, ఎజిఎం బాలకృష్ణ, ఎఐ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ కార్తీక పాల్గొన్నారు.

## పిఠాపురం బయలుదేరిన జనసైనికులు

**కుప్పంరూరల్, మార్చి 12 ప్రభాతవార్త**



జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈనెల 14వతేది కాకినాడ జిల్లా పిఠాపురం మండలో జరగనున్న విషయం విదితమే. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గుడుపల్లె మండల జనసేన అధ్యక్షుడు అమీర్ అధ్వర్యంలో జన సైనికులు పలువురు బుధవారం కుప్పం నుంచి రైలులో శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు.

## వారపుసంతవేలంతో 26.60లక్షల ఆదాయం



**శాంతిపురం, మార్చి 12 ప్రభాతవార్త** మండలంలోని కెనమాకులపల్లి పంచాయతీ లోని బడుగుమాకులపల్లి వారపు సంత వేలం ద్వారా పంచాయతీకి 26.60లక్షల ఆదాయం లభించింది. బుధవారం పంచాయతీ సర్పంచ్ ఎవి జయరాం అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ రాధాకృష్ణ, ఇఒపిఆర్‌డి రవినాయక్, కార్యదర్శి అశ్వత్ నారాయణ, జయరాంరెడ్డి, శివ, రమేష్, రాజారెడ్డి పాల్గొన్నారు. కాగా గతేడాది కంటే ఈ సారి పంచాయతీకి నాలుగు లక్షల ఆదాయం పెరిగింది.

## పెద్దదేవర సందర్భంగా పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత



**శాంతిపురం, మార్చి 12 ప్రభాతవార్త** మండలంలోని కదిరిముత్తనపల్లిలో జరుగుతున్న కురబ కులస్తుల పెద్ద దేవర సందర్భంగా పారిశుద్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలిచ్చారు. శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడంతో పాటు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. కాగా కడపల్లి పంచాయతీ పోడుచేన్లు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారంకు బోరు మోటారు పంప్‌సెట్, కేబుల్‌వైరు, స్టార్టరును మంజూరు చేసి సమస్య పరిష్కరించడం పట్ల గ్రామస్తులు ఎంపిడిఒకు కృతజ్ఞతలు తెలిపారు.

## వేరుసెనగ సాగుపై రైతులకు శిక్షణ



**కుప్పం, మార్చి 12 ప్రభాతవార్త** నూనెగింజల అభివృద్ధి పథకంలో భాగంగా బుధవారం వానగుట్ట పల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా అధ్వర్యంలో రైతులకు వేరుసెనగ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేరుసెనగ సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సమగ్ర ఎరువుల యాజ మాన్యం, కీటక యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. వేరుసెనగ పంటసాగులో జిప్సమ్‌తో కలిగేలాభాలను వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ ఔరంగ్, రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, సీనియర్ నేత శివకుమార్, స్థానిక నేతలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



**రామకుప్పం, మార్చి 12 ప్రభాతవార్త** మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం ఉచితంగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు డాక్యుమెంట్ ఫైల్స్‌తో పాటు మెడల్స్ బహుకరించారు. పదవ తరగతిలో ర్యాంకులు సాధించే విద్యార్థులకు తమ కళాశాలలో ఉచిత విద్య అందిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు బాలరాజు, సుబ్రి, కేశవరెడ్డి, నరసింహులు, అధ్యాపకులు వినయ్‌రెడ్డి, హరిప్రసాద్, సుబ్రమణ్యం, శివకుమార్, హరికృష్ణ, మమత, నందిని పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గ్రామాలలో తడి, పొడి చెత్త అవగాహన సదస్సు

**పూతలపట్టు, మార్చి 12, ప్రభాతవార్త**



మండల పరిధిలో తడి చెత్త, పొడి చెత్త ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం ఈవోపీఆర్డి శ్రీనివాసులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేయడం వల్ల నివారణ చేయడంతో పాటు వాటి వల్ల గ్రామ పంచాయతీలకు పాతికొండలుగా కూడా ఉపయోగించుకోవచ్చు కనుక ప్రతి కుటుంబం తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్ ద్వారా దోమలు గాని, ఈగలు గాని వృద్ధి చెందకుండా ఆరోగ్యం, పరుచుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. తడి పొడి చెత్త లను వేరువేరుగా అందించి సేంద్రియ ఎరువుల తయారీకి సహకరించాలని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు వేపనపల్లి. తేనేపల్లి, పి కొత్తకోట, కమ్మకుంటపల్లి, చిట్టి పీరాల పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలనే ముఖ్య ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా హేమశ్రీ బాధ్యతలు



**వెదురుకుప్పం, మార్చి 12 ప్రభాతవార్త :** మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా డాక్టర్ హేమశ్రీ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు అందజేస్తానని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో పేద రోగులు అధిక సంఖ్యలో ఉంటారని వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోఅందించేవైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావదినోత్సవం వేడుకలు



**వెదురుకుప్పం, మార్చి 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కూడలిలో, పాతగుంట కూడలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. కూడ లిలోగల మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహంకు పూలమాలవేసి నివాళి అర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి ఆవి ర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఉత్స హంగా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలు అమలులో పూర్తిగా విఫలమైయిందని వాటిని ప్రజల్లోకి తీసువెళ్ళాలని చూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు శిల్పా, భువనేశ్వరి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, బొమ్మసముద్రం శివాజీ, వెంకటేష్, గోవిందన్, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలంటే భయం విడచి ఇష్టపడి చదవాలి : సుజన్‌రాజు



**చౌడేపల్లి, మార్చి 12 ప్రభాతవార్త** పరీక్షలంటే భయం విడచిపెట్టి ఇష్టపడి చదవాలని దాత మాదిరాజు సుజన్‌రాజు అన్నారు. పట్టణంలోని ప్రాథమిక, ఉన్నతపాఠశాలల విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని ఉచితంగా అందించారు. క్రమశిక్షణతో కూడిన విద్య రాణిస్తుందన్నారు. పది పరీక్షల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక నగదునందిస్తున్నట్లు వివరించారు. చౌడేపల్లి, గోసలకురపల్లి, చారాల పాఠశాలలకు చెందిన 250మందికి పరీక్షా సామాగ్రినందించారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు, దాత మిత్రబృందం, జ్ఞానజ్యోతి ట్యుటోరియల్స్ నిర్వాహకులు ప్రభాకర్, రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చౌడేపల్లి, మార్చి 12 ప్రభాతవార్త** మండల కేంద్రమైన చౌడేపల్లిలో వైకాపా ఆవిర్భావ దినోత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైసిపి జెండాను ఎగురవేసి, విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం చిత్తూరులో జరిగే జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, కళ్యాణ్‌భరత్, రవిచంద్రారెడ్డి,చెంగారెడ్డి,కృష్ణారెడ్డి,తొండాశ్రీరాములు,బాబు, శంకర్‌రెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం



**చౌడేపల్లి, మార్చి 12 ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థికం సాయం చేసారు. వాసవీ-వనితాక్లబ్ ఆధ్వర్యంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు కుటుంబానికి ఆర్థిక సాయమందించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు ఐఎం రామ్‌కుమార్, ఇంటర్నేషనల్ ఆఫీసర్ ఇస్సా నాగలక్ష్మి, అధ్యక్షులు శ్రీనాథ్, నాగలక్ష్మి, లోకేష్, అమర, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలిసిన వైవి రాజేశ్వరి

**చిత్తూరురూరల్, మార్చి 12 ప్రభాతవార్త:**



రాష్ట్ర మానవవనరులు, ఐటిశాఖ మాత్యులు నారాలోకేష్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి బుధవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమైందని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మంచి ప్రాధాన్యత ఇస్తూ అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయించడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. ముఖ్యంగా ఆడపిల్లలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం శక్తి యాప్ ఏర్పాటు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. అలాగే చిత్తూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై విపులంగా ఆయనకు వివరించారు.

## గుర్తు తెలియని వాహనం డీకొని ఒకరికి గాయాలు

**తొట్టంబేడు, మార్చి 12 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలం సింగమాల గ్రామం హైవే బ్రిడ్జి వద్ద స్కూటర్‌ను మినీ వ్యాన్ డీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.



సింగమాల గ్రామానికి చెందిన గంగయ్య(48) సొంత పనుల నిమిత్తం శ్రీకాళహస్తికి వస్తుండగా నాయు దుపేట వైపు వెళ్తున్న మినీ వ్యాన్ డీకొట్టడంతో కాలికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించగా వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ప్రాథమిక చికిత్స అనంతరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. టుటౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్ని వీర్ సిబ్బంది నియామకం కోసం దరఖాస్తు చేసుకోండి

**తిరుపతి క్రీడ, మార్చి 12, ప్రభాతవార్త** ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం అగ్నివీర్ సిబ్బంది నియామకాలు 2025 -26 నమోదును ప్రారంభించిందని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ డైరెక్టర్ కర్నల్ పునీత్ కుమార్ తెలిపారు. వివిధ కేటగిరీల అగ్నివీర్ల నియామకం కోసం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదుకు చివరి తేదీ 10 ఏప్రిల్ 2025. ఒక అభ్యర్థి ఇప్పుడు రెండు వేర్వేరు అగ్నివీర్ కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ) మొట్ట మొదటిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహించబడుతోంది. అదనంగా 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని 06 నిమిషాలు 15 సెకన్లకు పెంచడం జరిగిందన్నారు. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ ఏ,బి,సి సర్టిఫికెట్ కలిగిన వారికి ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అలాగే అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటిఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కూడా ఇవ్వబడతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పాలనాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య , శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుంది. అందువల్ల అగ్నివీర్‌గా సైన్యంలో నియామకం కోసం దళారులకు డబ్బులు చెల్లించవద్దని తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి

**తిరుపతి కార్పొరేషన్, మార్చి 12, ప్రభాతవార్త** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన 32 మంది నిందితులకు ఒక్కొక్కరికి 10,000 రూపాయిల చొప్పున మొత్తం రూ.3,20,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్స్ సుబ్బారెడ్డి , సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్ వార్లు, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 32 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 32 మందికి 3,20,000 జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ పోలీస్ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## మత్స్యావతారంలో వెంకన్న దర్శనం

**పుంగనూరు, మార్చి 11, ప్రభాతవార్త**



శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారికి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ దినం స్వామివారిని దేదీప్యమానంగా అలంకరించి మత్స్య నారాయణ అవతారంలో పుంగనూరు పురవీధుల్లో వైభవంగా స్వామి వారిని ఊరేగించారు. బుధవారం త్రయోదశి రోజున ఉదయం 7:30 గంటలకు స్వామివారికి మత్స్యనారాయణ వేషంలో ఉత్సవం ఏర్పాటు చేయుటకు ప్రజలు ముఖ్యంగా గంగపుత్రులు ముందుకు వచ్చారు. ఆ మహావిష్ణువు లోక కళ్యాణం కొరకు వేదాలను రక్షించేందుకు మత్స్య రూపము దాల్చినారు. హైగ్రీవుడు అనే రాక్షసుడు బ్రహ్మ నిద్రిస్తున్న సమయంలో వేదాలను తస్కరించి, నాడు ఇది చరిత్ర చెప్పిన సత్యం క్షీరసాగరంలో ఉన్న మహావిష్ణువు శ్రీమన్నారాయణనుడు చేప రూపము దాల్చి సప్తసముద్రంలో దాగి ఉన్న హైగ్రీవుని వధించి వేదాలను రక్షించి వేదనారాయణుడైనాడు ఈ మహా పుణ్యక్షేత్రం నాగలాపురంలో ఉన్నది. ఈ దినం గంగపుత్రులు సాంప్రదాయ బెస్త, కుటుంబాలకు పూజలలో ప్రాధాన్యత ఇస్తారు.

## విద్యార్థుల సమస్యలపై యువత పోరు

- నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి

**శ్రీరంగరాజపురం, మార్చి 12 ప్రభాతవార్త:** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం సత్వరం చెల్లించాలని జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో బుధవారం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు మణి నేతృత్వంలో పార్టీ నాయకులు, విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి మాట్లాడుతూ సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వున్న సమయంలో విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి కార్యక్రమాలు సకాలంలో విద్యార్థులకు అందేవన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క హామీ అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. కొత్తపల్లిమిట్టలో స్కైలా రెడ్డి ఆధ్వర్యంలో యువకులతో బైక్ ర్యాలీ నిర్వహించి చిత్తూరు కలెక్టరేట్‌కు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పురం మండల వైకాపా నాయకులు కుప్పయ్య, జనార్ధన్, చిట్టి, మహేష్, శేషాద్రి, చిరంజీవి, సురేష్, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో గరుడ-2 అతిదిగృహం

-స్థలం పరిశీలించిన డిజి మీనా



**తిరుమల,మార్చి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులతో పాటు పోలీసు అధికారులు, పోలీసు ఉద్యోగుల కుటుంబాలు సభ్యులు కూడా ఉన్నారు. ఇలా వస్తున్న వారికి వసతి కల్పించేందుకు వీలుగా ఇప్పటికే తిరుపతి జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో గరుడ -1 విశ్రాంతి భవనం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇందులో అన్ని వసతులతో గదులు కేటాయిస్తున్నారు. పోలీసు విశ్రాంతి భవనానికి డిమాండ్ పెరగడంతో అవసరాల మేరకు గరుడ -2 పోలీసు విశ్రాంతి నూతన భవనం నిర్మాణానికి తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్‌తో కలసి స్థలాన్ని పరిశీలించారు.

## ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోండి : డిఎస్పీ




చిల్లకూరు, మార్చి 12 ప్రభాతవార్త : నిబంధనలకు లోబడి ప్రయాణించి ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవాలని గూడూరు డిఎస్పి గీతా కుమారి పేర్కొన్నారు. బుధవారం గూడూరు డిఎస్పీ గీతా కుమారి రోడ్‌సేఫ్టీ అవగా హనలో భాగంగా చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై స్పీడ్ గన్ తో వాహనాల వేగంను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదాలకు మూల కారణం అతివేగంతో పాటు తాగి వాహనాలు నడపడం అని అన్నారు. వాహన నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో గతంలో లాగా చలానాలు వేసి వదిలే ప్రసక్తే లేదని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలియజేశారు.

## వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**-జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ**



వెంకటగిరి, మార్చి 12 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నేదురుమల్లి భవనంలో పార్టీ జెండాను ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రజలకు చెప్పి మభ్య పెట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. పేదల కోసం వైసిపి పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు పి.ప్రసాద్‌రెడ్డి, చింతల శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు వహీదా,శ్రీనివాసులు, సుబ్బారావు, ఆరి శంకరయ్య, సుభావళి, నాయకులు బండి రమేష్‌రెడ్డి, మురళీకృష్ణ, నాగయ్య,సిపిఎల్ నరసింహారావు, సతీష్‌లు పాల్గొన్నారు.

## జాతీయ అర్చరీ పోటీలకు క్రీడాకారులు ఎంపిక



గూడూరు, మార్చి 12 ప్రభాతవార్త: ఇటీవల విజయ వాడలో జరిగిన అంతర్ జిల్లాల అర్చరీ పోటీల్లో చిల్లకూరు శారద నగర్లో ఏర్పాటై ఉన్న లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అండర్ 10 కాంపౌండ్ క్రీడా విభాగంలో పి. లక్ష్మి షణ్ముఖ మనదీప్, యు-13 ఇండియన్, కాంపౌండ్ రౌండ్ విభాగంలో కె లోహిత్ కుమార్ యాదవ్, పి.చంద్ర తేజ రికర్వ్ విభాగలో కె.చరిత్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెట్ శ్రీకాంత్‌రెడ్డి తెలియజేసారు. ఈ నెల 20 నుండి 29వ తేదీ వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూని వర్సిటీలో జరగనున్న ఆర్చరీ పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను అర్చరీకోచ్ టి.శివ శంకర్‌ను కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



చిల్లకూరు, మార్చి 12 ప్రభాతవార్త: మండల కేంద్రమైన చిల్లకూరు గ్రామంలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, కాటూరు శ్రీహరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భ ంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీ బలోపేత్తానికి సమిష్టిగా కృషి చేసి మళ్ళీ వైస్ జగన్మో హన్‌రెడ్డి పరిపాలనలో రాజన్న రాజ్యాన్ని చూసే విధంగా మనము వైసీపీ గెలుపుకు అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోనందవరం సుబ్బారావు, కాటూరు శ్రీహరి,సీనియర్ న్యాయవాది కోకోలు చంద్రశేఖర్, వై.సనత్ కుమార్‌రెడ్డి, శివారెడ్డి, కొట్టు గురునాదం, రవి. రఘు, సాయి, బాలాజీ, ప్రవీణ్, అరుణ్ బాబు వెంకటేశ్వర్లు, మాతయ్య, చాన్, తదితరులు, పాల్గొన్నారు.

## తడలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



తడ, మార్చి 12 ప్రభాతవార్త: తడలో బుధవారం ఉదయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఉన్న దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, పార్టీని మరింత బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కెలివి ఆర్ముగంతో పాటు పలువురు మండల పార్టీ నాయకులు, ఇటీవల పార్టీ పదవులు పొందిన కొత్త నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నెల్లూరులో జరిగిన యువత పోరు కార్యక్రమానికి ఇక్కడి నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

## విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు రాయితీ

కోట, మార్చి 12 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతం విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) పరిధిలో గృహ విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీ కరణకు 50 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందని కోట విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ ఎడి చిన్నయ్య తెలిపారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడు తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులకు తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ 2025 మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీలోగా స్వచ్ఛంధంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. .

## ఆప్కో ఎదుట ఆందోళన



కోట, మార్చి 12 ప్రభాతవార్త: కోట మండలం చంద్రశేఖరపురంలో ఉన్న ఆప్కో కార్యాలయం ఎదుట టిప్పర్ల యాజమాన్యం బుధవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఫ్లైయాష్‌ను తాము గ్రీవిన్ లీవ్ సంస్థ ద్వారా రవాణా చేశామని చెప్పారు. గత 9నెలలుగా రవాణా బిల్లులు చెల్లించకపోవడంతో చేసేదేమీ లేక ఈఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేయాల్సి వచ్చిందని తెలిపారు. టిప్పర్ల యజమానులు ఫైనాన్స్ ద్వారా టిప్పర్లను కొనుగోలు చేసి ఫ్లైయాష్‌ను రవాణా చేశామని చెప్పుకొచ్చారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న విషయాన్ని సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు.

## సూళ్లూరుపేటలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



సూళ్లూరుపేట, మార్చి 12 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేలపాలెం కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో కార్యకర్తలు, పార్టీ అభిమానుల నడుమ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆవిర్భావ కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, అలవల సురేష్, ఐతా శ్రీధర్, షేక్ హుస్సేన్, కాకి శ్రీరామమూర్తి, బాబురెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, చిన్ని రాజా, సుధాకర్, తుపాకుల ప్రసాద్, గండవరం సురేష్‌రెడ్డి, శరత్‌యాదవ్, గోగుల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## 264 గృహాలు మంజూరు : ఏఈ

బాలాయపల్లి, మార్చి 12 ప్రభాతవార్త: మండలంలోని ఇల్లు లేని పేదల కోసం 264 నూతన గృహాలు మంజూరు అయినట్లు హౌసింగ్ ఏ.ఈ.జి.బి. వెంకటేశ్వర్లు తెలిపారు.గృహనిర్మాణాలు చేపట్టే లబ్దిదారులకు ప్రభుత్వం రూ. 180,000 ఆర్థికసాయం అందిస్తుందని హౌసింగ్ తెలిపారు. గృహ నిర్మాణాలు చేపట్టే ఎస్సిలకు రూ.50వేలు, బిసిలకు 50వేలు, ఎస్టీలకు 75 వేలు అదనంగా మంజూరు చేస్తాం అని తెలిపారు. గృహనిర్మాణాలు చేపట్టే ఎస్సిలకు రూ. 230,000, బిసిలకు రూ.230,000, ఎస్టీలకు రూ.255,000 మొత్తం ఆర్థిక సాయం అందుతుందన్నారు. లబ్ధిదారులు జూన్ 1నాటికీ గృహాలను పూర్తి చేయాలని సూచించారు.

## ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి : కమిషనర్

సూళ్లూరుపేట, మార్చి 12 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు చెల్లించాలని ఇటీవల ప్రకటన జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య బుధవారం తెలిపారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది అసాంఘిక వ్యక్తులు 7989272438, 8434827329 నంబర్ల నుంచి ఫోన్ కాల్ చేసి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పన్నులు చెల్లించాలని మున్సిపల్ గుర్తింపు పొందిన ఉద్యోగులుగా చెప్తూ మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఆన్‌లైన్ ద్వారా సీడీఎంఏ వెబ్‌సైట్‌లోనూ, వార్డు సచివాలయంలో మాత్రమే పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య కోరారు.

## కాలుష్యం బారి నుంచి కాపాడండి



సూళ్లూరుపేట, మార్చి 12 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెంలో నివసిస్తున్న ప్రజలు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో తమను కాలుష్యం బారి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ ఏఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్ల గా నివాస స్థలాలకు పక్కనే ఉన్న ఓ రైస్‌మిల్లు నుంచి బూడిద తమ ఇళ్లపైకి వస్తూ కాలుష్యానికి గురిచేస్తుం దన్నారు. దీంతో తమకు లేనిపోని వ్యాధులు సంక్రమిస్తున్నాయని, ఈ విషయమై గతంలో ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వట్రపాలెం వాసులు విజ్ఞప్తి చేశారు.

## బీద రవిచంద్రను కలిసిన టిడిపి నేతలు



సూళ్లూరుపేట, మార్చి 12 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థిగా పార్టీ అధిష్టానవర్గం ప్రకటించిన బీద రవిచంద్రను స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు కలిసి బుధవారం అభినందించారు. ఎంఎల్‌సీగా విజయం సాధించిన తర్వాత సూళ్లూరు పేట నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని వారు విజ్ఞప్తి చేశారు. బీదను కలిసిన వారిలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్, సంచి కృష్ణయ్య, ఓ.రాజేంద్ర, వేమసాని శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేటలో 457వ నేత్రదానం



సూళ్లూరుపేట, మార్చి 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు గురువారం 457వ నేత్రదానం అందింది. పట్టణంలోని సాయి నగర్‌లో నివసిస్తున్న బీరక ప్రణీత్ (21)అనే ఐఐటి విద్యార్థి బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మరణానంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆ యువకుడి కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలకు పంపారు. ప్రణీత్ మద్రాస్‌లోని ఐఐటి చివరి సంవత్సరం చదువుతున్నాడు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



గూడూరు, మార్చి 12 ప్రభాతవార్త : గూడూరు జి.ఎస్.ఆర్ మున్సిపల్ హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ అసోసియేషన్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్ రావు తెలిపారు. ఈనెల 7వ తేదీన కావలిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్ ఎంపిక పోటీలలో హర్షవర్ధన్ తన ప్రతిభను నిరూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈనెల 14, 15, 16 తేదీలలో కడప జిల్లాలో నిర్వహించబడనున్నాయి.

## సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : డిఎస్పి గీత



గూడూరు, మార్చి 12 ప్రభాతవార్త : పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నందు గూడూరు డివిజన్ డిఎస్పీ పి. గీతాకుమారి ట్రాఫిక్ రూల్స్ నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాట్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు, రాజా వీధి, గాంధీ బొమ్మ సెంటర్ నందు ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది కావున దుకాణదారులు ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట గూడూరు టౌన్ సీఐ శేఖర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

చిల్లకూరు, మార్చి 12 ప్రభాతవార్త : మోటారు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి రోడ్డు ప్రక్క ఐజేఎం ఎమర్జెన్సీ ఎస్‌ఓఎస్ బాక్స్ దిమ్మెను దీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి పోటిపాలెం గ్రామానికి చెందిన మోర శ్రీనివాసులు (45)గా పోలీసులు గుర్తించారు. డిఎస్పి గీతా కుమారి, ఎస్ఐ సురేష్ బాబులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## పేద ప్రజల అభివృద్ధి జగన్ ధ్యేయం




గూడూరు, మార్చి 12 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని రాష్ట్ర ప్రజలందరూ ఆయనకు అండగా ఉండాలని గూడూరు వైసిపి నాయకులు సుభాన్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి వైసిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుకాణాల ఏర్పాటుకు వేలంపాటలు

చిల్లకూరు, మార్చి 12 ప్రభాతవార్త : మండల పరిధిలోని తూర్పు కనుపూర్ గ్రామాల వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. తాత్కాలికంగా జాతర నాలుగు రోజులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వేలంపాటలు డిఎల్‌పిఓ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించగా మూడు లక్షలా ముప్పైవేల రూపాయలకు నల్లం కృష్ణ అనే వ్యక్తి పాడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అన్నాదు శెట్టినాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌కు ఘన సన్మానం



కోట, మార్చి 12 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైసీపీ ఫోరం రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యంరెడ్డి బుధవారం తాడేపల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సుబ్రహ్మణ్యంరెడ్డి 'ప్రభాతవార్త'తో ఫోన్‌లో మాట్లాడుతూ తనను గుర్తించి రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలు ఇచ్చినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపానన్నారు. వైసీపీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో తామంతా కలిసి కష్టపడి పనిచేస్తామని, తిరిగి వైసీపీని అధికారం లోకి తీసుకొచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేస్తామని చెప్పారు

## పి4 సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

వాకాడు, మార్చి 12 ప్రభాతవార్త : పి4, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయంలో శ్రీనివాసులు సందర్శించారు. సచివాలయం లోని రికార్డులు, క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ వేసవి కాలంలో తీవ్రత దృష్ట్యా గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, డిజిటల్ అసిస్టెంట్ జితేంద్ర, మహిళా పోలీస్ అమరావతి, ఏఎన్ఎం నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్నలు పాల్గొన్నారు.

## వాకాడులో వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవం



వాకాడు, మార్చి 12 ప్రభాతవార్త : వైఎస్ఆర్సిపి 15వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీప నందు ఘనంగా నిర్వహిం చారు. పార్టీఅధినేత జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టి 15 సంవత్సరాలు పూర్తయిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మండల వైఎస్సార్సీపి కమిటీ పూలమాలవేసి పాలాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు వాకాడు ఉపసర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి జనార్దన్ రెడ్డి, ఏనుగు సుధాకర్ నాయుడు, వాకాటి రవికుమార్, పాపారెడ్డి కోదండరామిరెడ్డి, సర్పంచ్ విజయరెడ్డి, బందెల వెంకటయ్యలు ఉన్నారు.

## కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి : కమిషనర్

వెంకటగిరి, మార్చి 12 ప్రభాతవార్త: కుట్టు మిషన్ల కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాలు వయసు కలిగి, తెల్లరేషన్ కార్డు ఉన్నవారు అర్హులు అనితెలిపారు. 60 రోజులు రోజుకు ఆరు గంటలు లేక 90 రోజులు రోజుకు నాలుగు గంటలు శిక్షణ ఇస్తారని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అర్హులు అని చెప్పారు సచివాలయాలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

వెంకటగిరి, మార్చి 12 ప్రభాతవార్త: ఆదర్శ పాఠశాలల్లో పాఠశాలల్లో ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరం 2025-26గాను అడ్మిషన్స్ కొరకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తులసి జ్యోతి తెలిపారు. పొందిన పాఠశాలల్లో పదోతరగతినులైన విద్యార్థులు అర్హులనే తెలిపారు. ఈనెల 17వ తేదీ నుండి మే నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్లైన్లో చేసుకోవాలని తెలిపారు.

## పైపులైనుకు మరమ్మతులు : వార్త ప్రభావం



వెంకటగిరి, మార్చి 10 ప్రభాతవార్త : పట్టణంలోని 14 వార్డు ధర్మాపురం ప్రాంతంలో తాగునీటి పైప్లైన్‌లో మురుగు నీరు కలుస్తుంది అన్న వార్తకు మున్సిపాలిటీ సిబ్బంది గుంటను పూడ్చారు. వార్త దినపత్రిక రికలో మురుగు నీటి గుంటలో గెట్‌వాలు ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పూడ్చారు. తాగునీటి పైపులైను గెట్‌వాల్ గుంటలో మురుగునీరు నిలిచి ఉండడం వల్ల తాగునీటి పైప్ లైన్‌లో కలుస్తున్నట్లు స్థానికులు వాపోయారు. గేట్ వాలు వద్ద స్థానికులు హర్షించారు. సమస్యను పరిష్కరించాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్సై

వెంకటగిరి, మార్చి 12, ప్రభాతవార్త మద్య సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై సుబ్బారావు తెలిపారు.అన్ని ప్రధాన రహదారుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ బ్రీత్ అనలైజర్ టెస్ట్ లు పట్టుబడిన ఒక్కొక్కరికి పదివేలు చొప్పున జరిమానా వేస్తామని తెలిపారు.

## మహిళలకు ఆర్థిక..డిజిటల్ లావాదేవీలపై శిక్షణ

**- కడ పి.డి. వికాస్ మర్మత్**



కుప్పం, మార్చి 12 ప్రభాతవార్త : సిఎం చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో మహిళలకు ఆర్థిక, డిజిటల్ లావాదేవీలపై శిక్షణ కల్పించి వారిని పారిశ్రామి కవేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం కడ కార్యాల యంలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఫ్రంటైయర్ మార్కెట్స్ మాన్యు ఫ్యాక్చరింగ్ కంపెనీ ఫౌండర్, సిఇఒ అజైతాషాతో కడ తరపున ప్రాజెక్ట్ డైరెక్టర్ మౌఖిక ఒప్పందం (ఎంఒయు) చేసుకుని పరస్పరం ఒప్పందపత్రాలు మార్చు కున్నారు. కడ పి.డి. మాట్లాడుతూ 2011లో అజైతాషా ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థను ప్రారంభించారన్నారు. ఈసంస్థ ద్వారా తొలుత కుప్పం మండలంలో 100మంది ఔత్సాహిక మహిళలకు ఆర్థిక, డిజిటల్ లావాదేవీలు, కొనుగోళ్లపై రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రనేత బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో ప్రతి ఇంట్లో ఓ పారిశ్రామిక వేత్త కావాలని చర్యలు చేపట్టారన్నారు. ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థకు సిఎం చంద్రబాబు, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు కూడా సుముఖత వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో ఫ్రంటైయర్ మార్కెట్స్ సిఇఒ అజైతాషా, రాష్ట్ర తెదేపా ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, కుప్పం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన ఏపీఐఐసీ చైర్మన్




సత్యవేడు, మార్చి 12 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ) చైర్మన్ ఎం.రామరాజు శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక వాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. రామరాజు ఎంతో ఆసక్తితో శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రామరాజు పర్యట నను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యనించారు. ఏపీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇది మొట్ట మొదటి శ్రీసిటీసందర్శన కాగా ఆయన పరిశీలనలు, సూచనలు తమకెంతో విలువైనవంటూ తన సందేశంలో పేర్కొన్నారు. ఏపీఐఐసీ చైర్మన్‌తో పాటు ఏపీఐఐసీ జోనల్‌మేనేజర్ విజయ భరత్‌రెడ్డిపాల్గొన్నారు.

## స్విమ్స్‌లో మహిళా దినోత్సవం ముగింపు వేడుకలు



తిరుపతి హెల్త్, మార్చి 12 ప్రభాతవార్త: స్విమ్స్‌లో బుధవారం ఘనంగాఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు వేడుకలు జరిగినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఉమ వెన్నమ్, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వైస్ చాన్సలర్, పలువురు హాజరయ్యారు. స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డాక్టర్ ఆర్.వి కుమార్, పలువురు డాక్టర్లు అంతర్జాతీయ దినోత్సవ సందర్భాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విభాగాధిపతులు, వైద్యులు, మహిళా సిబ్బంది, ఎంబీబీఎస్ ఫిజియోథెరఫీ, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో గృహ నిర్మాణాలకు ఊతం

తిరుపతి కలెక్టరేట్, మార్చి 12 ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికి గృహ నిర్మాణం అనే లక్ష్యాన్ని సాధించేందుకు అసంపూర్ణంగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఎస్సీలు, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు ఏప్రిల్ 2025లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి అదనపు ఆర్థిక లబ్ధి ఇవ్వడం జరుగుతుందన్నారు.




**CHANGE OF NAME**

I. **KONDETE SUBRAMANYAM** (Old Name) S/o KODETE VENKATA SUBBAIAH, R/at D.No.5-14, Eguvareddipalli, Kammapalli (P), Pullampeta (M), Annamayya Dist.A.P. I have changed my name to **KONDETI SUBRAMANYAM** S/o KONDETE VENKATA SUBBAIAH. Henceforth I shall be known as **KONDETI SUBRAMANYAM** (New Name).

I. **GHANDHAVALLA VENKATA MAHESH** (Old Name) S/o GHANDHAVALLA SUBRAHMANYAM, R/at D.No.25-2-424, lake view colony, SPSR Nellore Dist, A.P. I have changed my name to **GANDHAVALLA VENKATA MAHESH** S/o GHANDHAVALLA SUBRAHMANYAM. Henceforth I shall be known as **GANDHAVALLA VENKATA MAHESH** (New Name).

I. **CHERUKURU DHANANJAYULU NAIDU** (Old Name) S/o CHERUKURU RAMANAIAH NAIDU, R/at D.No.3-89/18-4, Vigneswara Nagar, Yogimallavaram, Tiruchanur, Tirupati. A.P. I have changed my name to **CHERUKURI DHANANJAYA NAIDU** S/o CHERUKURU RAMANAIAH NAIDU. Henceforth I shall be known as **CHERUKURI DHANANJAYA NAIDU** (New Name)


## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సుఫరిపాలన అందించింది

**-వైసిపి ఆవిర్భావ దినోత్సవంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



తిరుపతిరూరల్, మార్చి12 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నడు చూడని సంక్షేమ పాలన వైయస్. జగన్మోహన్‌రెడ్డి హయాంలో చూసారని, కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించారని ఆపార్టీ రిజనల్ కో-ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ముత్యాల రెడ్డిపల్లి మారుతినగర్‌లో ఆయన స్వగృహంలో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా యువతపోరుతో వైయస్సార్ సిపి శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి అరాచకపాలనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, కూటమికి చరమగీతం పాడటానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు.

## పరిశ్రమల్లో ప్రమాదాల కట్టడికి పక్కా చర్యలు : కలెక్టర్



చిత్తూరు, మార్చి 12 ప్రభాతవార్త: జిల్లాలో రసాయనాల ఉత్పత్తుల పరిశ్రమలో ప్రమాదాల కట్టడికి పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో సంక్షోభ నివారణ చర్యలపై అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో ఆపాయం నుండి తప్పించుకునే మార్గం, ప్రమాదాల నివారణపై ప్రతి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పరిశ్రమలో సంబంధిత అధికారుల సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించాలని, సంబంధిత అధికారులు మాక్ డ్రిల్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమలు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీస్ ఛీఫ్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం వెంకటరెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీహరికోటలో మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు



శ్రీహరికోట (తడ), మార్చి 12 ప్రభాతవార్త: శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో బుధవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బ్రహ్మప్రకాష్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కోయంబత్తూరు డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ భారతీ హరిశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవినాష్ లింగం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోం సైన్స్ మరియు హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమన్ పేరుతో ఈ యూనివర్శిటీ ఉంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రపంచ వ్యాప్తంగా మహిళలు సాధిస్తున్న విజయాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇస్రోలో పనిచేసే మహిళా శాస్త్రవేత్తలపై టీజర్ వీడియోను ప్రదర్శించారు. ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు ఈ కార్యక్రమానికి స్వాగతం పలకగా, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, రేంజ్ ఆపరేషనల్ డీడీ జి.గ్రహందొరై తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇప్పటికే నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంచిపెట్టారు.